"ఇదివరకటిలా రేపు చెత్తని అతని నెత్తి మీద అభిషేకించి చూడు. తేడా నీకే తెలుస్తుంది." చెప్పాడు గురువు.

మర్నాడు ఆమె ఇల్లు ఊడ్చిన చెత్తని తెచ్చి పైనించి రాజు నెత్తి మీద కుమ్మరించింది. రాజు వెంటనే ఆమెకి రెండు చేతులూ జోడించి చెప్పాడు.

"అమ్మా! నా పాడు మనసుకి ఇంకా అహం అన్న మలినం వదలనందుకు మంచి పనే చేసావు."

ఆ రోజు గురువు రాజుకి మంత్రోపదేశం చేస్తూ చెప్పాడు.

" మనసనే పాత్రలోని అహం సంపూర్ణంగా ఖాళీ అయితేనే కదా, అందులో కొత్తది ఏది నింపినా తేలిగ్గా పట్టేది."

## 69. నిజమైన ప్రార్థన

ఓ పరోపకారి అలుపు, సొలుపు లేకుండా ఇతరులకి సాధ్యమైనంత మేర సహాయం చేస్తూండేవాడు. ఓ సారి అతను ఎవరికో సహాయం చేసి తిరిగి ఇంటికి వెళ్తూంటే, అడవిలో ఓ అందమైన అమ్మాయి ఓ చోట కూర్చుని కనిపించింది. ఆమె తన చేతిలోని పుస్తకంలో ఏదో రాసుకుంటూండటం అతను చూసాడు.

"మీరెవరు? దాంట్లో ఏం రాస్తున్నారు?" ఆసక్తిగా అడిగాడతను.

"నేనో దేవదూతని. భగవంతుడి మీద అపారమైన ప్రేమ, భక్తి గలవారి పేర్లు ఇందులో వరసగా రాస్తున్నాను. నీ పేరు చెప్తే అది ఇందులో ఉందేమో చూస్తాను." అడిగిందామె.

"నా పేరు అందులో ఉండకపోవచ్చు. నేనెన్నడూ గుడికి వెళ్ళింది లేదు. దైవ ప్రార్థన కానీ, వ్రతాలు, ఉపవాసాలు కానీ చేసి ఎరగను." ముక్తసరిగా జవాబు చెప్పాడతను.

"నీ మొహం చూస్తూంటే మంచివాడివేనని నాకనిపిస్తోంది. నీ తీరిక

సమయాల్లో గుడికి వెళ్ళకుండా నువ్వేం చేస్తూంటావు?" ప్రశ్నించిందా దేవదూత.

"సాటి మనుషులకి, జీవాలకి సేవ చేయడంతో నాకు గుడికెళ్ళే తీరిక చిక్కదు." జవాబు చెప్పాడతను.

"అలాగా? ఐనా నీ పేరు చెప్పు. ఇందుల్లో ఉందేమో చూస్తాను." అడిగిందా దేవదూత మళ్ళీ.

అతను మొహమాట పడుతూనే తన పేరు చెప్పాడు. ఆమె పుస్తకంలోని పేర్లని చూసి వాటిలో అతని పేరు లేకపోవడంతో పెదవి విరిచి చెప్పింది.

"నువ్వు చెప్పింది నిజమే. వీటిలో నీ పేరు లేదు."

ఆమె దగ్గర శెలవు తీసుకుని అతను వెళ్తూండగా చెప్పిందా దేవదూత.

"నీ మొహం చూస్తూంటే నీ పేరు ఖచ్చితంగా వుండాలనిపిస్తోంది. ఆగు. ఇంకో పుస్తకం ఉంది. అందులో నీ పేరేమైనా ఉందేమో చూస్తాను."

మరో చిన్న పుస్తకం తీసి, దాన్ని తిరగేసింది. అందులోని పేర్ల జాబితాలో అన్నిటికన్నా పైనున్న అతని పేరుని చూపించింది.

"నా పేరు ఇందులో ఎందుకుంది? ఈ పుస్తకం ఏమిటి?" ప్రశ్నించాడు అతను.

"ఇది భగవంతుడు ప్రేమించేవారి పేర్లున్న పుస్తకం." చెప్పిందామె.

అతను విస్మయంగా చూస్తూంటే దేవదూత ఇలా వివరించింది.

"తన విగ్రహాన్ని ఆరాధించే వారికంటే, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేసేవారే భగవంతుడికి చాలా ప్రీతిపాత్రమైనవారు."

## 70. పారాయణం పుణ్యం

భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం పుణ్యం అని తెలిసిన ఓ భక్తుడు నిత్యం వేణుగోపాలస్వామి ఆలయంలో కూర్చుని